సాక్షి మహబూబాబాద్

శుక్రవారం | 23 | జూన్ | 2023



చేసేందుకా.. కాజేసేందుకా?

ఎస్సారెస్పీ కాల్వల ఆధునికీకరణ పనులు ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. నీటి ప్రవాహం పేరిట కాంట్రాక్టర్లు కాలయాపన చేస్తున్నారు.

- 8లో▸



గార్ల ఎంపీపీపై దాడి

గార్ల ఎంపీపీపై జరిగిన దాడి ఘటనలో 16మందిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$38.7^{0}/25.2^{0}$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం పలుచోట్ల చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రైతులు సహకరించాలి



దోర్నకల్: జాతీయ రహదారి నిర్మాణం కోసం వినియోగించే భూముల అవార్డు ఎంక్వైరీ కోసం రైతులు సహకరించాలని మహబూబాబాద్ ఆర్డీఓ కొమురయ్య కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఎస్‌హెచ్ 365/ఏ కురవి–ఖమ్మం రహదారి నిర్మాణానికి సంబంధించి అవార్డు ఎంక్వైరీ జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. జాతీయ రహదారి కోసం రాయిగూడెం పరిధిలో 22వ సర్వే నంబర్ నుంచి 96 మంది రైతులకు చెందిన 11.31 ఎకరాలు, ముల్కలపల్లిలో 26వ సర్వే నంబర్ నుంచి 83 మంది రైతులకు చెందిన 10.39 ఎకరాల భూమిని వినియోగిస్తున్నట్లు తెలిపారు. అవార్డు ఎంక్వైరీ ద్వారా రైతుల భూముల హక్కు పత్రాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. భూములకు సంబంధించి రీ సర్వే సాధ్యం కాదని, అభ్యంతరాలను నేషనల్ హైవే అథారిటీ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వాతిబిందు, ఎంపీడీఓ అపర్ణ, సీఐ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ క్వారీ వద్ద రైతుల ఆందోళన



నెల్లికుదురు: గ్రానైట్ క్వారీ బండరాళ్లను పొలాలకు వెళ్లే దారికి అడ్డుగా వేసి మూసివేశారని రైతులు ఆందోళనకు దిగిన ఘటన మండల కేంద్రంలోని హెచ్‌కేజీ గ్రానైట్ క్వారీ వద్ద గురువారం సాయంత్రం జరిగింది. రైతులు ప్రభాకర్, రవి, పవన్ మాట్లాడుతూ.. 392, 380 సర్వే నంబర్లలో పూర్వం నుంచి పొలాలకు వెళ్లే దారి ఉందన్నారు. గ్రానైట్ వ్యాపారులు దారిని ఆక్రమించారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా క్వారీ నిర్వహిస్తున్నారని, ఎస్సారెస్పీ కాల్వను కూడా ఆక్రమించారని ఆరోపించారు. క్వారీపై విచారణ చేపట్టి దారిని పునరుద్ధరించి తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు సోమయ్య, శంకర్, నీలమ్మ, వసంత, వెంకటమ్మ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

గడపగడపకూ సంక్షేమ పథకాలు



మహబూబాబాద్ అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు గడపగడపకూ చేరాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలో గడపగడపకూ సంక్షేమ పథకాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ.. కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని, గ్రామాలకు నిధులు మంజూరు చేస్తుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పలు కాలనీల్లో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలు, డోర్ స్టిక్కర్లను పంపిణీ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీతయ్య, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ మురళి, ఉపాధ్యక్షురాలు పద్మవతి, ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్, సందీప్, యశ్వంత్, ప్రశాంత్, శివకృష్ణ, శ్రీను, లక్ష్మినర్సింహరావు, భద్రయ్య, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

‘గిరిజనబంధు’ అమలు చేయాలి



కురవి: గిరిజనబంధు అమలు చేయాలని తెలంగాణ ప్రదేశ్ ఎరుకుల సంఘం జిల్లా అధ్యక్షుడు పేరం వీరస్వామి ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట చలో మహబూబాబాద్ వాల్‌పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జూలై 6న మహబూబాబాద్ పట్టణంలో సంఘం ఆధ్వర్యంలో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోట ఎల్లేష్, నిమ్మశెట్టి మహేష్, రాగం కృష్ణ, దళిత సంఘం నాయకుడు కిన్నెర మల్లయ్య పాల్గొన్నారు.

జీపీ భవనాలకు మోక్షం

జిల్లాలో 176 గ్రామ పంచాయతీలకు భవనాలు మంజూరు

- ఈజీఎస్, ట్రైబల్ వెల్ఫేర్ నుంచి నిధుల కేటాయింపు
- ప్రతీ భవనం రూ.20లక్షలతో నిర్మాణం
- 22 భవనాలకు శంకుస్థాపన



మానుకోట మండలం చోక్లాతండా జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే(ఫైల్)

మహబూబాబాద్: జిల్లాలో నూతన గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు మంజూరయ్యాయి. ఈమేరకు 176 జీపీల్లో నిర్మాణాలు చేపట్టనున్నారు. ఇందుకు ఈజీఎస్, ట్రైబల్ వెల్ఫేర్ నుంచి నిధులు కేటాయించారు.కాగా ఒక్కో జీపీ భవనానికి రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయి. దీంతో ఇప్పటి వరకు 22గ్రామాల్లో శంకుస్థాపనలు చేశారు. కాగా ఇన్నాళ్లు సొంత భవనాలు లేక గ్రామ పంచాయతీ పాలకవర్గం, అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. భవనాల నిర్మాణంతో ఇబ్బందులు తొలిగిపోతాయని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 461 జీపీలు..

జిల్లాలోని 18 మండలాల్లో 461 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 222 పాత గ్రామ పంచాయతీలు ఉండగా.. 208జీపీలు సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇందులో 31భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అలాగే 14 గ్రామ పంచాయతీలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. కాగా ప్రభుత్వం కొత్తగా తండాలు, గ్రామాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసింది. ఇందులో 14 జీపీలు సొంత భవనాల్లో కొనసాగుతుండగా.. 225అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. కనీస సౌకర్యాలు లేక పాలకవర్గం, అధికారులు, ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. ఈ తరుణంలో 176 జీపీలకు ప్రభుత్వం భవనాలు మంజూరు చేసింది. ప్రతీ జీపీకి రూ.20లక్షల చొప్పున కేటాయించింది. ఈజీఎస్ ద్వారా 62జీపీల భవనాలకు నిధులు మంజూరు చేశారు. అందుకు రూ.12.40కోట్లు కేటాయించారు. నిర్మాణ పనులను పీఆర్ శాఖకు అప్పగించారు.

ట్రైబల్ వెల్ఫేర్ నుంచి నిధులు..

ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ఎస్టీ స్పెషల్‌ఫండ్ నుంచి 114జీపీలకు నిధులు మంజూరు చేసింది. ఎస్టీ సర్పంచ్ గల జీపీల భవనాలకు మాత్రమే ఈ నిధులను కేటాయించారు. ఆ నిధులతో సర్పంచ్ గది, సెక్రటరీ గది, మీటింగ్‌హాల్, స్టోర్ రూం, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలి. నిధులు ఎక్కువగా ఉండి స్థలం ఎక్కువగా ఉంటే భారీ నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నారు.

22జీపీల్లో శంకుస్థాపన..

జిల్లా వ్యాప్తంగా 176 జీపీ భవనాలు మంజూరు కాగా ఇప్పటి వరకు 22 నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. నూతన భవనాలు పూర్తయితే ఆయా గ్రామపంచాయతీల్లో చాలా వరకు సమస్యలు తీరుతాయి.

త్వరలోనే పూర్తి చేస్తాం..



జిల్లాలో నేటి వరకు 22 గ్రామ పంచాయతీల భవనాలకు శంకుస్థాపన పూర్తయింది. ప్రతీ జీపీకి రూ.20లక్షల చొప్పున కేటాయించారు. అన్ని హంగులతో భవనాలు పూర్తి చేయిస్తాం. నిబంధనల ప్రకారం నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయిస్తాం. అవి పూర్తియితే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయి.

– నర్మద, డీపీఓ

సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదు

- భూపాలపల్లి సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



బహిరంగ సభలో మాట్లాడుతున్న బండి సంజయ్

భూపాలపల్లి/భూపాలపల్లి రూరల్: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు ప్రస్తుతం జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని, సంస్థను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని, రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చాక పాత బకాయిలు మొత్తం చెల్లించి పరిరక్షిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. ఆ పార్టీ చేపట్టిన మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం భూపాలపల్లి నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో బండి సంజయ్ మాట్లాడారు. సీఎం కేసీఆర్ తన కూతురిని యూనియన్ నాయకురాలిని చేసి సంస్థను ఏటీఎంలా వాడుకుంటున్నారని ఆరోపించారు. ఓపెన్‌కాస్ట్‌లను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన కేసీఆర్ ఇవ్వాల 17 ఓపెన్‌కాస్ట్‌లకు అనుమతి తీసుకున్నాడన్నారు. సింగరేణి నుంచి రూ. 25 వేల కోట్ల అప్పు ప్రభుత్వం తీసుకుందని, సంస్థను దివాలా తీయించేందుకు కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. బీఆర్‌ఎస్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నిస్తున్నందుకు, ప్రజలను దారి మళ్లించేందుకు పీఎం మోదీ తనకు దోస్త్ అని సీఎం ప్రచారం చేసుకుంటున్నాడని అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఉచిత వైద్యం, విద్య, ప్రతిఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని సంజయ్ హామీ ఇచ్చారు. సభలో రిటైర్డ్ డీజీపీ కృష్ణప్రసాద్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు చందుపట్ల కీర్తిరెడ్డి, రాకేష్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు ఉదయ్‌ప్రతాప్, సునీల్‌రెడ్డి, పాపయ్య, రాజుగౌడ్, ఎరుకల గణపతి, మునీందర్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైలులో వస్తూ.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం



వినయ్‌కుమార్

గూడూరు: మండలంలోని రాములుతండాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నూనావత్ వినయ్‌కుమార్ అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. తండాకు చెందిన నూనావత్ సదాశివుడు కుమారుడు వినయ్‌కుమార్‌కు 5 నెలల క్రితం పెళ్లి జరిగింది. నాలుగేళ్లుగా కోల్‌కతాలోని పీడబ్ల్యూసీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. మూడు వారాల క్రితం వరకు వర్క్ ఫ్రం హోం చేసిన వినయ్‌కుమార్.. కంపెనీ పిలుపుతో ఇటీవల కోల్‌కతాకు వెళ్లాడు. బుధవారం రాత్రి కోల్‌కతా– కొయంబత్తూర్ రైలులో బయలుదేరిన వినయ్‌కుమార్.. విజయవాడ వరకు వస్తున్నట్లు ఫోన్‌లో తండ్రి సదాశివుడికి చెప్పాడు. రాత్రి 10.26 గంటలకు రైలు కటక్..జోత్‌పూర్ మార్గంలో వస్తుండగా వినయ్‌కుమార్ తండ్రికి కాల్ చేసి మాట్లాడుతుండగా ఒక్కసారిగాఆయింది. దీంతో కంగారు పడిన తండ్రి మరోసారి కాల్ చేయగా రింగ్ అయినా లిఫ్ట్ చేయలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు గురువారం తెల్లవారుజామున విజయవాడకు చేరుకున్నారు. వినయ్‌కుమార్ కూర్చున్న బీ.1 బోగీలో సీటు వద్దకు వెళ్లి చూడగా బ్యాగ్ మాత్రమే ఉంది. ఈ విషయంపై బోగీలోని ఇతర ప్రయాణికులను వాకబు చేయగా రాత్రి ఉన్నాడని, తెల్లవారేసరికి కనిపించలేదని చెప్పారు. ఈవిషయమై విజయవాడలో రైల్వే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు తీసుకోలేదని, లాస్ట్ కాల్ మాట్లాడిన ఏరియా పరిధిలోని పీఎస్‌లో ఫిర్యాదు చేయమంటున్నారని తెలిపారు. ఇదిలా ఉండగా, రైలులో వస్తున్న వినయ్‌కుమార్ డోర్ పక్కన నిలబడి మాట్లాడుతూ కిందపడి ఉంటాడా, లేక ఎవరైనా కిడ్నాప్ చేశారా అనే అంశం ప్రశ్నార్థకంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

బాస్కెట్ బాల్ ఎంపికలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఈ నెల 25న మధ్యాహ్నం 3గంటలకు బాలబాలికలకు జిల్లా స్థాయి జూనియర్ బాస్కెట్ బాల్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి ముల్లంగి ప్రతాప్‌రెడ్డి గురువారం తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 1-1-2005 తర్వాత పుట్టిన వారై ఉండాలని, క్రీడాకారులు తమ వెంట ఒరిజనల్ జనన ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు తీసుకొని హాజరుకావాలన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 28, 29,30,31 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

భవనం నిరుపయోగం!





నిరుపయోగంగా మారిన మోడల్ స్కూల్ హాస్టల్ భవనం, పగిలిన కిటికీ అద్దాలు

- వసతుల కొరతతో తెరుచుకోని మోడల్‌స్కూల్ హాస్టల్
- శిథిలావస్థలో కిటికీలు, తలుపులు
- దూర ప్రాంతాల విద్యార్థినులకు ఇబ్బందులు

దోర్నకల్: దోర్నకల్ సమీపంలోని చిలుకోడు మోడల్ స్కూల్‌లో చదివే బాలికల కోసం నిర్మించిన హాస్టల్ భవనం ఏళ్లుగా నిరుపయోగంగా ఉంటుంది. వసతులు లేవనే సాకుతో ఇప్పటి హాస్టల్ వసతి కల్పించకపోవడంతో దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా వసతులు కల్పించి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థినుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

2013లో నిర్మాణం..

2013లో రూ.1.25 కోట్ల వ్యయంతో 25 గదులతో మోడల్ స్కూల్ హాస్టల్ భవనం నిర్మించారు. గదుల్లో బాలికల కోసం బెడ్లు, చైర్లు, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, తాగునీటి కోసం ప్యూరిఫైర్ వాటర్ మిషన్, స్నానానికి వేడి నీటి కోసం భవనంపైన సోలార్ వాటర్ హీటర్ ఏర్పాటు చేశారు. గ్యాస్ సిలిండర్లు, వంటసామగ్రి ఇతర వస్తువులు ఏర్పాటు చేశారు. 2019 అక్టోబర్ 26న ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ హాస్టల్ భవనాన్ని ప్రారంభించారు. అయితే తాగునీరు, విద్యుత్ సమస్యతో పాటు వృథానీరు, టాయిలెట్ల నీరు బయటకు వెళ్లే అవకాశాలు లేక బాలికలకు వసతి కల్పించడం లేదు. భవనం నిరుపయోగంగా మారండంతో వస్తువులు, కిటికీలు, తలుపులు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. నాటి నుంచి నేటి వరకు హాస్టల్ సేవలు అందుబాటులోకి రాకపోవడంతో బాలికలు దూర ప్రాంతాల నుంచి మోడల్ స్కూల్‌కు వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఫలితాల్లో మేటి..

మోడల్ స్కూల్ ఏర్పాటైన సంవత్సరం నుంచే విద్యార్థులు రాష్ట్ర, జిల్లాస్థాయి ఫలితాలు సాధిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో 92 శాతం ఉత్తీర్ణత సాధించగా బైపీసీ విద్యార్థి 989 మార్కులు, ఎంపీసీ విద్యార్థి 976 మార్కులు సాధించారు. 27 మంది విద్యార్థులు 900కు పైగా మార్కులు సాధించి రికార్డు సృష్టించారు. ముగ్గురు విద్యార్థులు ఐఐటీ, ఆరుగురు విద్యార్థులు నిట్ ర్యాంకులు సాధించగా చాలా మంది విద్యార్థులు ఎంసెట్‌లో మెరుగైన ర్యాంకులు సాధించారు. పదో తరగతిలోనూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.

నాయకత్వ లక్షణాలపై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న విజయకుమారి

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థినులకు వాయిస్ ఫర్ గర్ల్స్ సంస్థ ఆధ్వర్యంలో నాయకత్వం లక్షణాలపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ విజయకుమారి, ఇన్‌చార్జ్ వాణి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న బాలికలకు నాయకత్వ లక్షణాలు, సమస్యల పరిష్కారం, తదితర అంశాల అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ శిక్షణ పది రోజులు నిర్వహిస్తున్నామని, ఇనుగుర్తి, నర్సింహులపేట, తొర్రూరు, కూసుమంచి, కల్లూరు, వైరా, టేకుమట్ల గురుకుల పాఠశాలల నుంచి 163మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో వాయిస్ ఫర్ గర్ల్స్ సభ్యులు యాశిక, అఖిల, శ్రీవాణి, చాందిని, నిఖిత, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు విజయవంతం

- కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: జిల్లాలో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించామని కలెక్టర్ శశాంక అన్నారు. గురువారం ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. వెన్నంటి ప్రోత్సహించిన మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, జెడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యేలు బానోత్ శంకర్‌నాయక్, డీఎస్ రెడ్యానాయక్, మున్సిపల్ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధుల సహకారం మరువలేనిదన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో అసువులు బాసిన అమరవీరులను స్మరించుకోవడం, వారి కుటుంబాలను సన్మానించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. మండుటెండలో సైతం ప్రజలు కార్యక్రమాలకు తండోపతండాలుగా తరలివచ్చి విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

- మంత్రి సత్యవతిరాథోడ్
- అమరుల కుటుంబాలకు సన్మానం



అమరుల కుటుంబాలను సన్మానిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్



అమరుల కుటుంబాలతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, చైర్‌పర్సన్, కలెక్టర్

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరుల త్యాగాలు మరువలేనివని గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన తెలంగాణ అమరవీరుల సంస్మరణ సభకు మంత్రి సత్యవతిరాథోడ్, జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, కలెక్టర్ శశాంక హాజరై అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ.. స్వరాష్ట్ర సాధనలో అమరుల ప్రాణత్యాగాల ను వెలకట్టలేమన్నారు. ఆనాడు ఆంధ్ర పాలకుల కుట్రలతో తెలంగాణ రాదేమోనన్న ప్రచారంతో యువకులు ఆత్మబలిదానాలు చేసుకున్నారన్నారు. అసువులుబాసిన అమరులను నిత్యం స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. హైదరాబాద్ నడిబొడ్డున అమరుల స్మారక చిహ్నం నిర్మించుకున్నామని, పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలిపేందుకు సీఎం కేసీఆర్ చేస్తున్న కృషి అద్భుతమని కొనియాడారు. అమరుల త్యాగం వృథా కాకుండా రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అమరుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, ఒక్కో కుటుంబానికి రూ.10లక్షలతో పాటు అర్హులైన వారికి ఉద్యోగం, ఇంటి స్థలం, ఇళ్లు మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం అమరుల కుటుంబాలను ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సత్కరించారు. వారితో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అభిలాష అభినవ్, ట్రైనీ కలెక్టర్ పింకేశ్‌కుమార్, జెడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ, జెడ్పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

అమరవీరుల స్తూపం వద్ద నివాళులు



నివాళులర్పించి మౌనం పాటిస్తున్న మంత్రి, జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులు

మహబూబాబాద్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద మంత్రి సత్యవతి రాథోడ్, జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, డేవిడ్, ట్రైనీ కలెక్టర్ పింకేశ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఫరీద్, కమిషనర్ ప్రసన్నరాణి, ఆర్డీఓ కొమురయ్య, తహసీల్దార్ ఇమ్మానుయేల్ నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు సూర్యనారాయణ, ఛత్రునాయక్, రామకృష్ణ, ఖుర్షీద్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, జెడ్పీటీసీ సుచిత్ర, నాయకులు వెంకన్న, రంజిత్, రాజశేఖర్, రవి, రాజు, మహబూబ్‌పాషా, నిమ్మల శ్రీనివాస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

గంగారం: వానాకాలం సీజన్‌లో ప్రభుత్వం రైతులకు అన్ని రకాలుగా సహకారం అందించి, సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూణెం ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో పలుడిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుబంధుతో పాటు సాగుకు అవసరమైన అన్ని రకాల వ్యవసాయ ఉపకరణాలను అందించాలని కోరారు. రైతుల రుణమాఫీ చేసి కొత్త రుణాలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, ఉచితంగా అందించాలని కోరారు. మార్కెట్‌లోకి నకిలీ విత్తనాలు రాకుండా అడ్డుకోవాలని, నకిలీవిత్తనాలు అమ్మకాలు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. బిక్షం, కుర్సం రంగయ్య, నాయకులు నాగేశ్వర్‌రావు, బుచ్చిరాములు, వీరస్వామి పాల్గొన్నారు.

కొనసాగుతున్న శాకంబరీ మహోత్సవాలు

హన్మకొండ కల్చరల్: భద్రకాళీ ఆలయంలో శాకంబరీ నవరాత్రి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం అమ్మవారికి సుప్రభాతసేవ, నిత్యాహ్నికం, క్షీరాన్న నివేదన నీరాజన మంత్రపుష్పం నిర్వహించారు.ఉదయం కురుకుల్లాక్రమంలో, భేరుండాక్రమంలో అమ్మవారికి నవరాత్ర విశేష పూజలు నిర్వహించారు. మంత్రి జగదీశ్‌రెడ్డి కుమారుడు వేమన్‌రెడ్డి, సమాచార కమిషనర్ శేఖర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.

దశాబ్ది ఉత్సవాల పేరుతో దగా..

- కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ
- సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మహబూబాబాద్ రూరల్: దశాబ్ది ఉత్సవాల పేరుతో సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజలను దగా చేశారని కాంగ్రెస్ పార్టీ మానుకోట నియోజకవర్గ ఇన్‌చార్జ్ మురళీనాయక్ అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇన్‌చార్జ్ అయూబ్‌ఖాన్ ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి నివాసం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. తహసీల్‌లో వినతిపత్రం అందజేసిన అనంతరం కోర్టు సెంటర్‌లో పది తలల సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మురళీనాయక్ మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజల సొమ్మును పార్టీ ప్రచారానికి వాడుకున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై నిలదీస్తే కేసులు పెట్టి పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిప్పుతున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలు, రైతులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని మండిపడ్డారు. కేజీ టు పీజీ ఉచిత నిర్బంధ విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, పేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు, దళిత కుటుంబాలకు మూడు ఎకరాలు, పోడు భూములకు పట్టాలు, రైతు రుణమాఫీ, గిరిజన, ముస్లిం రిజర్వేషన్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. దొంగ హామీలు ఇస్తూ అరాచక పాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. అమరుల త్యాగాలతో వచ్చిన తెలంగాణను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్‌చందర్, టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు నూనావత్ రాధ, జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షుడు ఖలీల్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పోతురాజు రాజు, బానోత్ ప్రసాద్, నీరుటి సురేష్, సల్వాది దిలీప్, పార్టీ మండలాల అధ్యక్షులు మిట్టకంటి రాంరెడ్డి, అంబటి మహేందర్, నాయకులు నారాయణ, శ్రీను, రవి, శ్రవణ్, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక పద్ధతిలో నియామకాలు

విద్యారణ్యపురి : ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని మహాత్మాజ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో వివిధ సబ్జెక్టుల్లో విద్యాబోధనకు తాత్కాలిక పద్ధతిలో నియామకాలు చేపడుతున్నట్లు ఆ బీసీ గురుకులాల ఆర్‌సీవో వై మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆంగ్లమాధ్యమంలో విద్యబోధన చేయాల్సి ఉంటుందన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌, గణితం, సైన్స్‌, సోషల్‌ సబ్జెక్టుల్లో విద్యాబోధన చేయాల్సింటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సంబంధిత విద్యార్హతల సర్టిఫికెట్లతో హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్‌లోని బీసీ గురుకుల పాఠశాలలో డెమో, ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. ఈనెల 26న తెలుగు, మ్యాథ్స్‌, సోషల్‌ సబ్జెక్టులకు, 27న సైన్స్‌, ఇంగ్లిష్‌ ,హిందీ సబ్జెక్టులకు హాజరుకావాలన్నారు. వివరాలకు 9154102639, 9550064323 నంబర్లను సంప్రదించాలన్నారు. సంబంధిత సబ్జెక్టులలో పీజీ తోపాటు బీఈడీ కలిగి ఉండాలన్నారు.

రిటైర్డ్‌ ఎంపీడీఓ హత్యపై విచారణ..?

బచ్చన్నపేట : మండలంలోని పోచన్నపేటకు చెందిన రిటైర్డ్‌ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్యపై పోలీసులు పలువురిని విచారిస్తున్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలకు చెందిన దాదాపు 40 మందిని స్టేషన్‌కు తీసుకొచ్చి వారి కాల్‌ డేటాతోపాటు పలు వివరాలు సేకరించారు. కాగా, రామకృష్ణయ్యను గిరబోయిన అంజయ్య ఈనెల 15న హత్య చేయించిన విషయం పోలీసుల విచారణలో వెల్లడైంది తెలిసిందే. అదే రోజు జెడ్పీ వైస్‌ చైర్‌పర్సన్‌ గిరబోయిన భాగ్యలక్ష్మి ఇంటి ఎదుట పలువురు సంబురాలు జరుపుకున్న అనంతరం విందు ఏర్పాటు చేసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆ విందులో పాల్గొన్న వారిని స్టేషన్‌కు తీసుకొచ్చిన పోలీసులు.. సంబురాలు ఎందుకు చేసుకున్నారనే కోణంలో విచారిస్తున్నట్లు సమాచారం. కాగా, ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా తమకేమీ తెలియదని చెబుతున్నారు.



ఆరేళ్ల తర్వాత హడావుడిగా చేపట్టిన హనుమకొండ పెగడపల్లి డబ్బాల సమీపంలో కాకతీయ ప్రధాన కాల్వల ఆధునీకరణ పనులు



ఆరేళ్ల కిందట రూ.873.61 కోట్లు..

ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాల్వల ఆధునికీకరణ కోసం 2017లో 83 పనుల కోసం రూ.873.61 కోట్లు జీఓఎంఎస్‌ 67 ద్వారా ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. నిర్మల్‌ జిల్లా పోచంపాడు నుంచి (0.000 కి.మీ.ల నుంచి 284.000 కి.మీ.ల) ఖమ్మం జిల్లా తీర్థాల వరకు ప్రధాన కాల్వల ఆధునికీకరణతోపాటు లక్ష్మీ కెనాల్‌, సరస్వతి కెనాల్‌, సదర్మాట్‌ల మెయింటనెన్స్‌ పనులకు నిధులిచ్చారు. ప్రధానంగా కాకతీయ ప్రధాన కాల్వ ఏడు పనుల కోసం రూ.385.56 కోట్లు, 63 డిస్ట్రిబ్యూటరీల కోసం రూ.356.14 కోట్లు కేటాయించారు. ప్రభుత్వం కేటాయించిన మొత్తం రూ.873.61 కోట్లలో రూ.741.70 కోట్లు ప్రధాన కాల్వల ఆధునికీకరణకు ఇచ్చారు. ఈ పనులకు 2018లో టెండర్లు జరగగా, వరంగల్‌, హైదరాబాద్‌లకు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. వరంగల్‌ జిల్లాకు చెందిన కొందరు కీలక ప్రజాప్రతినిధులు అసలు కాంట్రాక్టర్లపై ఒత్తిడి చేసి వారి బినామీ కాంట్రాక్టర్లకు సబ్‌ కాంట్రాక్ట్‌కింద పనులు కట్టబెట్టారు. ఏడాదిలో పనులు పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు సరఫరా చేయాల్సి ఉండగా.. సాగదీస్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చేసేందుకా... కాజేసేందుకా?

ఆరేళ్లుగా పెండింగ్‌లో ఎస్సారెస్పీ కాల్వల ఆధునికీకరణ

- రూ.873.61 కోట్లతో 83 పనులు.. 2018లో పూర్తయిన టెండర్లు
- కాల్వల్లో నీటి ప్రవాహం పేరిట కాలయాపన....
- హడావుడిగా రూ.122.90 కోట్ల పనులు మొదలెట్టిన కాంట్రాక్టర్లు
- మళ్లీ వర్షాలు పడే ముందు మొదలెట్టడంపై అనుమానాలు
- ఫలహారంగా కాకతీయ కాల్వల ఆధునికీకరణ నిధులు
- గతంలో డీబీఎం 38, 48 పనుల్లో అక్రమాలు.. సొంతశాఖ నుంచే ఫిర్యాదులు..
- ఇంకా కొనసాగుతున్న 'విజిలెన్స్‌'విచారణ

శ్రీరాంసాగర్‌ ప్రాజెక్టు స్టేజ్‌–1 కాకతీయ ప్రధాన కాలువల ఆధునికీకరణ నిధులు కొందరు అధికారుల, కాంట్రాక్టర్లకు ఫలహారంగా మారాయి. ప్రతి ఎకరానికి నీరందించడమే లక్ష్యంగా సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్మాణం, ఆధునికీకరణకు ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తోంది. కొందరు అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కు కావడం వల్ల నిధులు దుర్వినియోగం అవుతుండడంతోపాటు ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

సాక్షిప్రతినిధి, వరంగల్‌:

వరంగల్‌ జిల్లా నర్సంపేట డివిజన్‌ గీసుకొండ, పర్వతగిరి ప్రాంతాల్లో డీబీఎం–38, డీబీఎం–48లలో జరిగిన పనుల్లో భారీగా అక్రమాలు జరిగాయి. సుమారు రూ.100 కోట్ల పనుల్లో 25 శాతం వరకు పనులు చేయకుండానే నిధులు డ్రా చేశారన్న ఫిర్యాదులపై విజిలెన్స్‌ విచారణకు ఆదేశించారు. ఆ తర్వాత మిగతా పనులు కూడా నిలిపి వేశారు. జగిత్యాల ఏరియాలో రూ.51.16 కోట్లు, ఎల్‌ఎండీ పైన రూ.32.24 కోట్లతో పనులు పూర్తి కాగా, ఎల్‌ఎండీపరిధిలోని 146 కి.మీ.ల నుంచి 191 కి.మీ.ల వరకు రూ.133.51 కోట్ల పనులు చాలా చోట్ల పెండింగ్‌లో పెట్టారు. అదే విధంగా రూ.122.09 కోట్లు కేటాయించిన 191 కి.మీ.ల నుంచి 234 కి .మీ.ల (తాడికల్‌ నుంచి కేయూ క్యాంపస్‌ సమీపం) వరకు కూడా పనులు చేయలేదు. ఆరేళ్లుగా కాల్వల్లో నీటి ప్రవాహం ఉందని కారణంగా కాలయాపన చేసిన అధికారులు, కాంట్రాక్టర్లు.. సరిగ్గా వానాకాలం ఆరంభానికి ముందు.. పదిహేను రోజుల కిందట మళ్లీ పనులు మొదలెట్టడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పనులు చేసేందుకా?.. గతంలో లాగే కాజేసేందుకా? అన్న చర్చ జరుగుతోంది.



తూతూ మంత్రంగా..సాగుతున్న హనుమకొండ యాదవనగర్‌ సమీపంలో ఎస్సారెస్పీ కాల్వల ఆధునికీకరణ పనులు

డీబీఎం–38,48 పనులపై సాగుతున్న 'విజిలెన్స్‌'విచారణ...

వరంగల్‌ జిల్లాలోని ఎస్‌ఆర్‌ఎస్‌పీ, డీబీఎం 48 సీసీహెచ్‌ డివిజన్‌ నంబర్‌ 4 పరిధిలోని తీగరాజుపల్లి, పర్వతగిరి, మహబూబాబాద్‌, డోర్నకల్‌, ఖమ్మం జిల్లాలోని తీర్థాల వరకు ఆధునికీకరణ పనుల కోసం రూ.123కోట్లు కేటాయించారు. ఈ నిధులతో డీబీఎం 48, 1ఆర్‌ 2ఎల్‌, 3ఎఆర్‌, 6ఎల్‌, 10ఆర్‌, 1,13 ఆర్‌, 16 ఆర్‌, 17 ఎల్‌, 21ఆర్‌, 24 ఆర్‌, 25 ఎల్‌, 26 ఎల్‌, 27 ఎల్‌, 28 ఆర్‌, 29 ఎల్‌, 30 ఆర్‌, 31 ఎల్‌, 32 ఎల్‌, 34 ఆర్‌, 35 ఎల్‌, 26 ఆర్‌, 38 ఆర్‌ ఉప కాల్వల అభివృద్ధి, ఎర్త్‌ వర్క్‌ బ్యాంకింగ్‌, సీసీ లైనింగ్‌, ఇన్‌స్పెక్షన్‌ పాత్‌ పనులు చేపట్టాల్సి ఉంది. అయితే, ఈ పనులు చేయకుండానే కాంట్రాక్టర్లు, అధికారులు, రాజకీయ నాయకులు కుమ్మక్కై దాదాపు రూ.17 కోట్ల పనులు జరిగినట్లుగా బిల్లులు రికార్డు చేసుకొని, డబ్బులు డ్రా చేసుకున్నారన్న ఫిర్యాదులపై ప్రభుత్వం ఆదేశించిన విజిలెన్స్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ విచారణ ఇంకా సాగుతోంది. డీబీఎం 38 ప్యాకేజీ పనులు గీసుకొండ, మల్లంపల్లి, పరకాల వరకు రూ.123 కోట్ల అంచనా వ్యయంతో డోవెల్‌ బ్యాంకింగ్‌, సీసీ లైనింగ్‌, ఇన్‌స్పెక్షన్‌ పాత్‌ల అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు దుర్వినియోగంపైన విచారణ జరుగుతోంది. ఇదే సమయంలో ఆరేళ్ల పెండింగ్‌లో ఉన్న పనులను వర్షాకాలం ముందు ప్రారంభించడం వల్ల మళ్లీ నాసిరకం పనులతో నిధులు కాజేసే అవకాశం ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి.

కాల్వల్లో నీరుండడం వల్లే ఆలస్యం..

2018 జనవరిలో పనులు ప్రారంభమయ్యాయి. వాస్తవానికి కాల్వల్లో నీళ్లు ఉండటం వల్లే ఆలస్యం జరిగింది. రూ.122.09 కోట్ల వ్యయంతో 191–234 కిలోమీటర్లు వరకు చేయాల్సిన పనులకు గాను 202 కి.మీ.ల వరకు పూర్తయ్యాయి. చివరి ఆయకట్టు వరకు ప్రతి ఎకరానికి నీరందించడమే లక్ష్యంగా ప్రభుత్వం నిధులు కేటాయించింది. ప్రస్తుతం 202–234 కి.మీ.ల వరకు పనులు చేపట్టారు. నాణ్యతాప్రమాణాల ప్రకారం పనులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

\- కె.సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఈ, జలవనరుల శాఖ

రీ–ఆర్గనైజేషన్‌ వల్ల ..

కాకతీయ ప్రధాన కాల్వల పునరుద్ధరణ పనుల పూర్తికి నీటి ప్రవాహంతో పాటు నీటి పారుదల శాఖ రీ–ఆర్గనైజేషన్‌ కారణంగా ఆలస్యమైంది. ఏఈఈలు మొదలు చీఫ్‌ ఇంజనీర్ల వరకు మారి, కొత్త వాళ్లు వచ్చారు. ఈ వానాకాలంలోనైనా చివరి ఆయకట్టుకు నీరందాలంటే ఇప్పటికే పనులు పూర్తి కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జూలై నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని మొదలు పెట్టాం. వర్షాల ఉధృతి పెరగకముందే పూర్తి చేస్తాం.

\- సునీత, ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌, జలవనరులశాఖ

పథకం పేరు: ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాల్వల ఆధునికీకరణ

మొత్తం పనులు:	83
మంజూరైన నిధులు:	రూ.873.61 కోట్లు
పనులు ప్రారంభం:	2018 జనవరి
స్థిరీకరించిన ఆయకట్టు :	13.70 లక్షల ఎకరాలు

గార్ల ఎంపీపీపై దాడి

- 16 మందిపై కేసు



ఎంపీపీపై దాడి చేస్తున్న రాంసింగ్‌ అనుచరులు

గార్ల: మహబూబాబాద్‌ జిల్లా గార్ల ఎంపీపీ ఎం శివాజీచౌహాన్‌పై దాడికి పాల్పడిన ఘటనలో 16 మందిపై గురువారం కేసులు నమోదయ్యాయి. ఎస్సై వెంకన్న కథనం ప్రకారం మండలంలోని పెద్దకిష్టాపురానికి చెందిన జీ రాంసింగ్‌ బుధవారం రాత్రి తిర్లాపురంలోని బంక్‌కు వెళ్లి పెట్రోల్‌ పోయించుకున్నారు. అనంతరం పెట్రోల్‌ బాయ్‌ సాయికి రూ. 2వేల నోటు ఇవ్వగా, తమ యజమాని రూ.2వేల నోటు తీసుకోవద్దన్నాడని.. ఫోన్‌పే చేయమని కోరాడు. దీంతో రాంసింగ్‌..రూ. 2వేల నోటు ఎందుకు తీసుకోవంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ కారును మూవ్‌ చేశారు. ఈ క్రమంలో కారు ఆపమని డోర్‌ పట్టుకున్న సాయి కాలుకు తీవ్రగాయాలయ్యాయి. పెట్రోల్‌ బాయ్‌ కేకలు వేయడంతో గ్రామస్తులు రాంసింగ్‌ కారును ఆపారు. ఈలోపు పెట్రోల్‌ కోసం వచ్చిన ఎంపీపీ శివాజీ చౌహాన్‌ విషయం తెలుసుకుంటుండగా ఎంపీపీపై కూడా రాంసింగ్‌ దురుసుగా ప్రవర్తించడంతో ఎంపీపీ మందలించాడు. దీనిని దృష్టిలో ఉంచుకున్న రాంసింగ్‌ గురువారం ఉదయం తన అనుచరులతో గార్లకు వచ్చి ఎంపీపీపై దాడి చేశారు. ఈ దాడిలో ఎంపీపీతో పాటు అతని తమ్ముడు, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఎంపీపీ ఫిర్యాదు మేరకు రాంసింగ్‌తో పాటు అతని అనుచరులు 16 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాపాడబోయి.. కనిపించని లోకాలకు..

- విద్యుదాఘాతంతో వ్యక్తి దుర్మరణం



కొమ్మయ్య మృతదేహం

సంగెం: ఇనుప దండెంపై తడిబట్టలు ఆరవేస్తున్న మహిళకు కరెంట్‌ షాక్‌ తగలడంతో అరుపులు విని కాపాడబోయి అదే తీగ తగిలి ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని కాపులకనిపర్తికి చెందిన సదిరం కొమ్మయ్య(57) ఇంటి ఎదుట గల ఇనుప దండెంపై పక్కింటికి చెందిన సదిరం రమ తడి బట్టలు ఆరవేస్తోంది. ఈ క్రమంలో దండెంకు కరెంట్‌ సరఫరా వచ్చి రమ విద్యుదాఘాతానికి గురై కేకలు వేసింది. అక్కడే ఉన్న కొమ్మయ్య రమ విడిపించే ప్రయత్నంలో దండెంకు తగలగా విద్యుత్‌ షాక్‌క గురై అక్కడిక్కడే మృతి చెందాడు. రమ తీవ్రగాయంతో స్పృహతప్పి పడిపోయింది. రమను 108లో ఎంజీఎంకు తరలించారు. మృతుడి కుమారుడు సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భరత్‌ తెలిపారు.

'గీతం'లో నాలుగేళ్ల డిగ్రీ కోర్సులు

- యూనివర్సిటీ అడ్మిషన్స్‌ డైరెక్టర్‌ ఉదయకుమార్‌

హన్మకొండ అర్బన్‌ : జాతీయ విద్యా విధానం–2020 అమలులో భాగంగా గీతం డీమ్డ్‌ విశ్వవిద్యాలయంలో 2023–2024 విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల డిగ్రీ (హానర్స్‌) కోర్సులను ప్రారంభిస్తున్నట్లు యూనివర్సిటీ అడ్మిషన్స్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ సి.ఉదయకుమార్‌ తెలిపారు. ఈమేరకు గురువారం నగరంలోని సుప్రభ హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ కోర్సులు విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించడంతో పాటు వారికి ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తాయన్నారు. ఈ నాలుగేళ్ల కోర్సుల ద్వారా విద్యార్థులు క్లిష్టమైన సమస్యలకు పరిష్కారం, విమర్శనాత్మక ఆలోచన, భావ ప్రకటన నైపుణ్యాలతో పాటు, కళలు, మానవీయ శాస్త్రాలు, మేనేజ్‌మెంట్‌, సైన్స్‌లోని అంతర్‌ విభాగ పాఠ్యాంశాలను అభ్యసించొచ్చని తెలిపారు. గీతం నూతనంగా తీసుకువస్తున్న లిబరల్‌ ఎడ్యుకేషన్‌ (ఉదార విద్య) ద్వారా విద్యార్థులు బీఏ, బీబీఏ, బీఎస్సీలలో దేనిలో చేరినా మొదటి సెమిస్టర్‌లో మొత్తం ఒకేరకమైన పాఠ్యాంశాలను అభ్యసిస్తారని, రెండో సెమిస్టర్‌లో విద్యార్థులు కావాలనుకుంటే ఈ మూడింటిలో ఒకదానిలో నుంచి మరో కోర్సుకు మారవచ్చన్నారు. దేశంలో 19 కేంద్రీయ విశ్వవిద్యాలయాలతో సహా 105 వర్సిటీలలో ఈ విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల అండర్‌ గ్రాడ్యుయేట్‌ కోర్సు ప్రారంభంకానున్నట్లు తెలిపారు. అందులో గీతం కూడా ఒకటి ఆయన తెలిపారు. కార్యక్రమంలో గీతం యూనివర్సిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మూగ యువకుడి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ



వంశీ మృతదేహం

జనగామ రూరల్‌ : జ్వరంతో బాధపడుతున్న ఓ మూగ యువకుడిని చికిత్స నిమిత్తం జనగామలోని ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చిన కొద్ది గంటలలోనే మృతి చెందాడు. బంధువుల కథనం ప్రకారం మండలంలోని ఓబుల్‌కేశావాపూర్‌కు చెందిన కర్రె వంశీ (18) జ్వరంతో బాధపడుతున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు గురువారం ఆస్పత్రికి తీసుకురాగా మొదట ఈసీజీ తీసిన వైద్యులు.. అనంతరం అడ్మిట్‌ చేసుకున్నారు. ఉదయం 11 గంటలకు వైద్యం చేస్తుండగా మృతి చెందాడు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి..

ఉదయం 8 గంటలకే ఆస్పత్రికి తీసుకొచ్చినా 11 గంటల వరకూ వైద్యం చేయకపోవడంతోనే ఆరోగ్య పరిస్థితి విషమించి వంశీ మృతి చెందాడని, దీనికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు ఆరోపించారు. 11.30 గంటలకు ఇంజక్షన్‌ ఇచ్చిన తరువాత 11. 45 గంటలకు మృతి చెందాడని వైద్యులను నిలదీశారు. ఈ విషయంపై ఆస్పత్రి సూపరింటెండెంట్‌ సుగుణాకర్‌ రాజును వివరణ కోరగా వంశీకి ఆస్పత్రిలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా వెంటనే వైద్యం అందించారని తెలిపారు.

చంద్రయ్యపల్లిలో చికిత్స పొందుతున్న యువకుడు..



అనిల్‌(ఫైల్‌)

నల్లబెల్లి: అజాగ్రత్తతో బైక్‌ నడిపిన ఓ యువకుడు.. గైడ్‌ పోస్టును ఢీకొని వాగులో పడ్డాడు. దీంతో తీవ్రగాయాలుకాగా స్థానికులు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దుగ్గొండి మండలం చంద్రయ్యపల్లికి చెందిన పాండవుల రమణమ్మ, రాజన్న దంపతుల కుమారుడు అనిల్‌(24) నల్లబెల్లి రెడీమిక్స్‌ ప్లాంట్‌లో జేసీబీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం శనిగరం క్రాస్‌లో వ్యక్తిగత పనులు ముగించుకున్న అనిల్‌.. బైక్‌పై నల్లబెల్లి వైపు వస్తూ అజాగ్రత్తతో మధ్యలవాగు గైడ్‌ పోస్టును ఢీకొన్నాడు. దీంతో బైక్‌తో సహా వాగులో పడిపోగా తీవ్రగాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నగేశ్‌ తెలిపారు.

కంచనపల్లిలో మరో యువకుడు..



రమేశ్‌(ఫైల్‌)

రఘునాథపల్లి: అకారణంగా భార్య కేసు పెట్టిందని మనస్తాపానికి గురైన భర్త.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కంచనపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన కొడగాని రమేశ్‌ (28)కు అదే గ్రామానికి చెందిన కాంటెవాడ పెద్ద సోమయ్య కూతురు సునీతతో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. ఏడాది క్రితం దంపతులు హైదరాబాద్‌కు వలస వెళ్లారు. అక్కడ గొడవలు జరగడంతో భార్య సునీత.. భర్త పై ఉప్పల్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో మనోవేదనకు గురైన రమేశ్‌ కంచనపల్లికి వచ్చి తల్లి వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన ఆయన బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే జనగామ వరంగల్‌ ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి ఇందిర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

రైతులకు పైసా పరిహారం ఇవ్వలే..

- టీజేఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం



మాట్లాడుతున్న కోదండరాం

ఎస్‌ఎస్‌ తాడ్వాయి: ఈ ఏడాది ఏప్రిల్‌లో కురిసిన అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.11 వేల పరిహారం చెల్లిస్తానని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటి వరకూ పైసా ఇవ్వలేదని టీజేఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్‌ కోదండరాం అన్నారు. దివంగత ప్రొఫెసర్‌ జయశంకర్‌ స్వగ్రామం అక్కంపేట నుంచి చేపట్టిన 'తెలంగాణ బచావో' యాత్ర గురువారం మేడారంలో ముగిసింది. యాత్ర ముగింపు పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తరుగు పేరుతో రైతులను దోపిడీకి గురిచేయడంతో వారు ఎక్కడపడితే అక్కడ తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మునుగోడు ఉప ఎన్నికలో ఓటర్లకు మద్యం, పైసలు ఇచ్చి ఓట్లు దండుకున్నారని ఆరోపించారు. ప్రజా సంక్షేమం కోసం ఈ యాత్ర చేపడుతున్నామన్నారు. మేడారం జాతర అభివృద్ధికి కోట్లు ఖర్చు పెడుతున్న ప్రభుత్వం.. మేడారానికి సమీపంలోనే ఉన్న ఎల్బాక గ్రామంలో చిన్న లోలెవల్‌ కాజ్‌వే కూడా నిర్మించలేదని మండిపడ్డారు. ఈ జాతర అభివృద్ధిపై ప్రజలతో కమిటీ వేసి పనుల నాణ్యతను పర్యవేక్షిస్తామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి శ్రీనివాస్‌ మాట్లాడుతూ మంత్రి కేటీఆర్‌.. వచ్చే ఎన్నికల్లో పైసా ఖర్చు పెట్టకుండా గెలుస్తామని చెప్పారని, అదే సవాల్‌గా తీసుకుని ఎన్నికల్లో పోటీ చేయాలని డిమాండ్‌ చేసారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శంకర్‌రావు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌, జేఏసీ జిల్లా చైర్మన్‌ చాప బాబు దొర, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలి

- ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్‌ ఎస్‌.వీరయ్య



మాట్లాడుతున్న వీరయ్య

లింగాలఘణపురం: పేదలకు ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం ఈ నెల 27వ తేదీలోపు స్పష్టమైన వైఖరి ప్రకటించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్‌ ఎస్‌.వీరయ్య హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 18 నుంచి చేపట్టిన బస్సు యాత్ర గురువారం మండలంలోని పటేల్‌గూడెం సమీపంలోని గుడిసెవాసుల వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా గుడిసెవాసుల కాలనీకి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు కాచం కృష్ణమూర్తి నగర్‌గా నామకరణం చేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్‌ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో వీరయ్య మాట్లాడారు. ఇళ్లులేని పేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుంటే ప్రధాన రోడ్డుకు పక్కనే ఉన్నాయని, కోట్ల విలువైన భూమిని ఎందుకు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. పేదలకు రోడ్ల వెంట ఇళ్లు అవసరంలేదా.? కొండలు, గుట్టల్లోనే ఉండాలా అంటూ ప్రశ్నించారు. పేదలకు ఇళ్ల స్థలాలు కావాలంటూ ఏడాది నుంచి పోరాడుతున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 61 ప్రాంతాల్లో భూపోరాటం సాగుతుందని, ఈ నెల 18న చేపట్టిన బస్సు యాత్ర 27వ తేదీన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ముగుస్తుందని, అప్పటి వరకు ఇళ్లు, ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, కేవీపీఎస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, బస్సు యాత్ర బృందం నేతలు పద్మ, జగదీశ్‌, శోభన్‌, ఆనంద్‌, కనకారెడ్డి, రాజు, చందు, యాదగిరి, సోమయ్య, గోపి, శ్రీనివాస్‌, ప్రకాశ్‌ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వరంగల్‌ పార్లమెంట్‌ అధ్యక్షుడిగా విద్యాసాగర్‌రావు

- 17మందితో కమిటీ ఏర్పాటు

వరంగల్‌: టీడీపీ వరంగల్‌ పార్లమెంట్‌ నియోజకవర్గ కమిటీని నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ ముదిరాజ్‌ గురువారం జాబితాను విడుదల చేశారు. పార్లమెంట్‌ కమిటీ అధ్యక్షుడిగా అర్శనపల్లి విద్యాసాగర్‌ రావు (వరంగల్‌ పశ్చిమ), ఉపాధ్యక్షుడిగా జీఎల్‌ శ్రీధర్‌ (వరంగల్‌ తూర్పు), రెగూరి వెంకట్‌రెడ్డి(పరకాల), బర్ల యాకూబ్‌ (వరంగల్‌ పశ్చిమ), ప్రధాన కార్యదర్శులుగా నల్లకుంట రవికుమార్‌ (వరంగల్‌ తూర్పు), చొల్లేటి కృష్ణారెడ్డి(స్టేషన్‌ ఘనపూర్‌), అధికార ప్రతినిధులుగా గంగబోయిన రవీందర్‌ (పరకాల), బొలగాని చిత్తరంజన్‌ (పాలకుర్తి), కార్యాలయ కార్యదర్శిగా పిట్టల శ్రీనివాస్‌ (వర్ధన్నపేట), కోశాధికారిగా కాగితాల జయశంకర్‌ (వరంగల్‌ పశ్చిమ), కార్యనిర్వాక కార్యదర్శులుగా రేగుల సదయ్య(పరకాల), మాచర్ల నగేశ్‌(భూపాలపల్లి), కార్యదర్శులుగా హరిదాస్యం సురేశ్‌(వరంగల్‌ తూర్పు), లాడే రవీందర్‌(పరకాల), కేదాసి స్వామి (పరకాల), తాటికాయల అనిల్‌(వర్ధన్నపేట), మాడగాని మనోహర్‌(వరంగల్‌ పశ్చిమ) నియమితులయ్యారు. పార్టీ పట్ల అంకితభావం, క్రమశిక్షణను పరిగణలోకి తీసుకొని ముఖ్య నాయకులతో చర్చించి పూర్తిస్థాయి పార్టీ కమిటీని ఎంపిక చేశామని జ్ఞానేశ్వర్‌ తెలిపారు.

